సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

## మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కలిసి జిల్లాస్థాయి నార్కో కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీస్‌శాఖ కృషి చేస్తున్నదని, ఇతర శాఖలు కూడా తమవంతు సహకారం అందించాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టే దిశగా దృష్టి సారించాలని, దీనిపై ప్రజల్లో అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. విద్యార్థులకు పాఠశాల ప్రార్థనా సమయాల్లో సందేశాలను ఇవ్వాలన్నారు. ప్రతి పట్టణ, మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కలిసి మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఆర్డీవోలు కృష్ణవేణి, గణేశ్, డాక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### నీటిఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జిల్లాలో నీటి ఎద్దడి ప్రాంతాలను వెంటనే గుర్తించి, పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. లీకేజీలకు మరమ్మతు చేయాలని, ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, డీపీవో హరిప్రసాద్, మిషన్ భగీరథ అధికారి కృష్ణారెడ్డి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులను అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు

## బాధిత కుటుంబానికి అండగా..

కురవి, ఫిబ్రవరి 20 : కురవి మండలం బంచరాయితండా గ్రామానికి చెందిన ప్రజలు గ్రామస్తులందరి భాగస్వామ్యంతో హెల్పింగ్ హ్యాండ్స్ అనే వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసుకున్నారు. గ్రామంలో ఎవరైనా ఆపదలో ఉన్నా, బీదవారు మృతిచెందిన వాట్సాప్ గ్రూప్ ద్వారా నగదును సమకూర్చి ఆయా కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామానికి చెందిన బాదావత్ శంకర్ ఈనెల 16న అనారోగ్యంతో మృతిచెందాడు. వాట్సాప్ ద్వారా రూ.20వేల నగదును సమకూర్చి బుధవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. క్వింటాలు బియ్యం, 15 కిలోల నూనె డబ్బాతోపాటు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

## డోర్నకల్‌కు నూతన 108 వాహనం

డోర్నకల్ నూతన 108 వాహనం వద్ద సిబ్బంది

డోర్నకల్, ఫిబ్రవరి 20: డోర్నకల్‌కు నూతన 108 వాహనం మంజూరు కాగా, ఈఎన్‌టీలు శ్రీనివాస్, షమీనా, నవీన్, పైలెట్ సైదులు గురువారం పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...108 వాహన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# బీరోనిమడవకు నీటి కష్టం

- 10 రోజులుగా నిలిచిన భగీరథ నీటి సరఫరా
- విరిగిన గేట్‌వాల్వ్, పైపులు
- తీవ్రఇబ్బంది పడుతున్న గిరిజన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బయ్యారం, ఫిబ్రవరి 20 : బీరోనిమడవ గ్రామస్తులు తాగునీటి కోసం 10 రోజులుగా తండ్లాడుతున్నారు. ఇక్కడ వంద కుటుంబాలు ఉండగా, సుమారు 300 మంది ప్రజలు నివసిస్తున్నారు. ఎక్కువశాతం మంది మిషన్ భగీరథ నీటినే తాగునీటి అవసరాలకు వాడుతున్నారు. అయితే, భగీరథ ట్యాంక్ నుంచి గ్రామానికి వచ్చే పైపులైన్లకు సంబంధించిన గేట్‌వాల్వ్, పైపులు విరిగిపోవడంతో 10 రోజులుగా గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొందరు దగ్గరలో ఉన్న బోర్ల నుంచి, మరికొందరు గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావుల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామంలో తాగునీటికి ఉపయోగపడే చేతిపంపు ఉన్నా మరమ్మతు చేయకపోవడంతో పనిచేయడం లేదు. ఉదయం పనులకు వెళ్లేవారు నీటిని తెచ్చుకోలేక ఇబ్బందిపడుతున్నారు. గ్రామానికి తాగునీరు రావడం లేదని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని, నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. గతంలో కూడా చాలాసార్లు పైపులైన్లు విరిగితే, తాత్కాలిక మరమ్మతు చేశారే తప్ప, శాశ్వత మరమ్మతు చేయలేదని, దీంతో లీకేజీలు ఏర్పడి కలుషిత నీరే సరఫరా అవుతుందన్నారు. శాశ్వత మరమ్మతు పనులు చేపట్టకుంటే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని అందించాలని కోరుతున్నారు.

### పాత రోజులు గుర్తుకు...

ఏజెన్సీలోని మారుమూల గ్రామాల గిరిజన ప్రజలు గతంలో తాగునీటి కోసం చాలా ఇబ్బంది పడేవారు. గ్రామాల్లో ఉన్న చేతి పంపులు, వాగులు, చెలిమెలే వారి దిక్కయ్యేవి. ఈ క్రమంలో కలుషిత నీరు తాగి అనారోగ్యాల బారిన పడేవారు. కానీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథతో ఇంటింటికీ శుద్ధిచేసిన తాగునీటిని అందించడంతో ఏజెన్సీలోని గిరిజన ప్రజలకు తాగునీటి నీటి కష్టాలు తొలగిపోయాయి. కానీ, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కొన్ని గ్రామాల్లో అప్పుడప్పుడు తాగునీటి సమస్య తలెత్తి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. అలాంటి సమయాల్లో భగీరథ పథకం లేని పాత రోజులను ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

### నీళ్ల కోసం గోస పడుతున్నాం..

గేట్‌వాల్వ్, పైపులైన్ విరిగిపోవడంతో 10 రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక గోస పడుతున్నాం. ఇంటి పక్కన వారి బోర్లు, వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నాం. ఊరిలో ఉన్న చేతి పంపు కూడా పని చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇంత ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పైపులైన్లకు మరమ్మతు చేసి వెంటనే నీరందించాలి.

– కాంతమ్మ (భీరోనిమడవ)

# బందోబస్తు నడుమ ఎన్‌హెచ్ సర్వే

### అలైన్‌మెంట్ మార్చాలని బాధితుల వేడుకోలు

సర్వే ఆపేయాలని రెవెన్యూ అధికారులను వేడుకుంటున్న బాధితులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : పట్టణంలోని ఇల్లందు రోడ్‌లో గురువారం తెల్లవారుజాము నుంచి ఎన్‌హెచ్ 930పీ వలికొండ నుంచి భద్రాచలానికి వెళ్లే జాతీయ రహదారి కోసం రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు పోలీసులతో వచ్చి సర్వేను ప్రారంభించారు. సమాచారం తెలుకున్న ప్లాట్ల యజమానులు సర్వేను నిలిపివేయాలని వేడుకున్నా పట్టించుకోలేదు. ఈ సందర్భంగా బాధితులు చిత్తనూరి కృష్ణ, గోలోజు శ్రీనివాస్, చంద్రయ్య, మాధవి, బాలూనాయక్ మాట్లాడుతూ ఇల్లందు రోడ్‌పోతున్న ఎన్‌హెచ్ 930పీ రహదారికి సుమారుగా 70 మంది ప్లాట్ల స్థలాలు పోతున్నాయన్నారు. కొంతమంది కావాలనే గతం లో ఉన్న అలైన్‌మెంట్‌ను మార్చి నూతనం గా మళ్లీ సర్వే చేస్తున్నారని, 10 సంవత్సరా ల క్రితం ఇండ్లు కట్టుకోవడానికి తీసుకున్న జాగలు జాతీయ రహదారిలో పోతున్నాయని ఆవేదనను వ్యక్తం చేశారు. వెంటనే ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

## తగిన మోతాదులో ఎరువులు వాడాలి

సర్వేను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

గూడూరు, ఫిబ్రవరి 20 : పంట పొలాల్లో రైతులు మోతాదు ప్రకారమే ఎరువులను వాడాలని జిల్లా వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాస్ రావునాయక్ సూచించారు. గురువారం మండలంలోని తీగలవేణి, గాజులగట్టు, గూడూరు, బొద్దుగొండ గ్రామాల్లోని ఎరువులను దుకాణాలను తనిఖీ చేశారు. తీగలవేణి గ్రామంలో డిజిటల్ సర్వే ,బుకింగ్ సర్వే, ఫెర్టిలైజర్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా స్టాక్, బిల్‌బుక్‌లను నిరంతరం వ్యవసాయాధికారి వద్ద అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో అబ్దుల్ మాలీక్, ఏఈవో మధు, రైతులు పాల్గొన్నారు.

## పెట్రోల్ పోసుకొని ఒకరి ఆత్మహత్య

యాదగిరి(ఫైల్)

కురవి, ఫిబ్రవరి 20 : కుటుంబ సమస్యలు తట్టుకోలేక మానసికంగా ఇబ్బందిపడుతూ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని తరాల యాదగిరి(46) అనే వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కురవి మండల కేంద్రంలోని 747 కాలనీలో గురువారం జరిగింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం... కురవికి చెందిన తరాల యాదగిరి భార్య విజయ కొన్నేళ్ల క్రితం చనిపోయింది. కొడుకు అఖిల్, కుమార్తె దివ్య ఉన్నారు. భార్య చనిపోయిన తర్వాత మరో మహిళను వివాహం చేసుకోగా ఆమెకు కొడుకు, కుమార్తె జన్మించారు. తర్వాత జరిగిన గొడవల కారణంగా ఆ మహిళ కూడా వెళ్లిపోయింది. ఇటీవల మొదటి భార్య కుమార్తె దివ్య కూడా ప్రేమ పెళ్లి చేసుకోగా తీవ్ర మనస్తాపానికి గురైన యాదగిరి తాగుడుకు అలవాటు పడ్డాడు. గురువారం ఉదయం మద్యం తాగిన యాదగిరి ఎవరూలేని సమయంలో ఇంట్లోనే పెట్రోలు పోసుకొని నిప్పంటించుకొని సజీవదహనమయ్యాడు. మొదటి భార్య కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు కురవి ఎస్సై సతీశ్ తెలిపారు. మృతదేహాన్ని చూసి తల్లి నాగమ్మ, అన్నదమ్ములు, చెల్లెలు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

## గాయపడిన బాలికకు ఆర్థికసాయం

మరిపెడ, ఫిబ్రవరి 20 : పురపాలక సంఘం పరిధిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలిక సమంతకు వైద్య ఖర్చుల నిమిత్తం మరిపెడ యాదవ సంఘం ఆ ధ్వర్యంలో రూ. 12,500 ఆమె కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన బాలిక కుటుంబానికి దవాఖాన ఖర్చుల నిమిత్తం కొంతమేర ఆర్థికసాయం చేశామన్నారు. సమంత త్వరగా కోలుకోవడానికి దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు రేఖాఅశోక్ యాదవ్, రేఖార మేశ్‌యాదవ్, కలంచెర్ల వెంకన్నయాదవ్, ఉడుగుల రాజు, మారబోయిన రమేశ్ కాట్రాజ్, మట్టిపల్లి సతీశ్ పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను అమలుచేయాలి

కొత్తగూడ, ఫిబ్రవరి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు బూర్క వెంకటయ్య డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఏడాది పాలన పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ 7వ గ్యారెంటీగా స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య హక్కులను అమలు చేయాలన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యుగేంధర్, రాజమల్లు, సమ్మయ్య, పూర్ణచందర్, జామ్లా, మహేందర్, బిచ్చు, లక్ష్మయ్య, మోహన్‌రావు, జగ్గారావు పాల్గొన్నారు.

## మొరాయించిన ప్రైవేట్ స్కూల్ బస్సు

### విద్యార్థులతో నెట్టించిన డ్రైవర్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : పట్టణంలోని గాదె రుక్మారెడ్డి ప్రైవేట్ పాఠశాల స్కూల్ బస్సు గురువారం విద్యార్థులను ఇంటి వద్ద దించడానికి వెళ్తున్నక్రమంలో తహసీల్దార్ ఆఫీస్ వద్ద మోరాయించింది. బస్సు డ్రైవర్ వెంటనే విద్యార్థులను కిందికి దించి వారితోనే బస్సును నెట్టించాడు. రిపేర్‌లో ఉన్న బస్సును విద్యార్థులతో నెట్టించడం సోషల్ మీడియో వైరల్‌గా మారింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతూ ఫీజుల రూపంలో వేల రూపాయలు దండుకుంటున్నారని, కలెక్టర్ వెంటనే స్పందించి పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొరాయించిన గాదె రుక్మారెడ్డి స్కూల్ బస్సును నెట్టుతున్న విద్యార్థులు

# యూరియా కోసం తిప్పలు

పెద్దవంగర, ఫిబ్రవరి 20 : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. చిన్నవంగర గ్రామంలో పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే షాపు ఎదుట రైతులు బారులు తీరారు. యాసంగి సీజన్‌లో వేసిన మక్కజొన్న, వరి, మిర్చి పంటలకు యూరియా వాడకం ఎక్కువగా ఉండగా, తగినంత అందుబాటులో లేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా యూరియాను సొసైటీలకు మాత్రమే సరఫరా చేస్తుండడంతో రైతులు పెద్దఎత్తున బారులు తీరుతున్నారు. తగినంత యూరియా లభించక ఇబ్బందిపడుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం మండలంలో రైతులకు కావలసిన 15 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఇంకా 40 మెట్రిక్ టన్నులు రానుందని చెబుతున్నారు. మండల కేంద్రంలో ప్రైవేటు షాపులున్నా యూరియా అందుబాటులో లేక, ఇతర మండలాల వైపు పరుగులు తీయాల్సివస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, యూరియా అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

### ఒకవ్యక్తికి 2 బస్తాలే.. అదనం కావాలంటే లింక్..

నా పేరు పొడిశెట్టి ప్రవీణ్. బొమ్మకల్లు గ్రామం. ఒకరికి 2బస్తాలు మాత్రమే ఇస్తా అంటున్నారు. ఎక్కువ బస్తాలు కావాలంటే ఇతర మందులు ఏమైనా తీసుకోవాలని లింక్ పెడుతూ రైతులపై ఆర్థిక భారం మోపుతున్నారు. యూరియా కోసం రైతుల నుంచి ఆధార్ కార్డు తీసుకొని 2 బస్తాలు ఇస్తున్నారు. కానీ, రసీదు ఇవ్వడం లేదు. నా పేరు మీద ఎన్ని బస్తాలు ఆన్‌లైన్ చేస్తున్నారో అర్థం కావడం లేదు. కేవలం సొసైటికి సంబంధించిన రసీదు మాత్రమే ఇస్తున్నారు. యూరియా కోసం ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.

–పొడిశెట్టి ప్రవీణ్, బొమ్మకల్లు రైతు, పెద్దవంగర మండలం



చిన్నవంగరలోని కో ఆపరేటివ్ రైతు బజార్ షాపు ఎదుట యూరియా కోసం బారులు తీరిన రైతులు

## జీపీలకు నిధులు విడుదల చేయాలి

గార్ల, ఫిబ్రవరి 20 : గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని గురువారం ఎంపీడీవో మంగమ్మకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు, చెక్కులకు నిధులు మంజూరు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కిషన్, అభిలాష్, రామకృష్ణ, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

గార్ల, ఫిబ్రవరి 20: ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ అన్నారు. గురువారం గార్ల సీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ దవాఖాన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వాటర్ ప్యూరిఫయర్ అందజేత

దంతాలపల్లి : రామానుజపురం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామ మాజీ సర్పంచ్ వొలాద్రి రమేశ్‌రెడ్డి వాటర్ ప్యూరిఫయర్‌ను గురువారం అందజేశారు. మాజీ వార్డు సభ్యుడు ధర్మారపు ఎల్లయ్య పాఠశాలకు గడియారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, యాకయ్య, మధుకుమార్, రామ్మూర్తి, ప్రదీప్‌రెడ్డి, నగేశ్, అర్జున్‌బాబు పాల్గొన్నారు.

## ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

మహబూబాబాద్ రూరల్ : ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత అని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, ప్రముఖ సైకాలజిస్ట్ పరికిపండ్ల అశోక్ అన్నారు. గురువారం పట్టణంలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మహత్యల నివారణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఆత్మహత్యాయత్నం చేసుకునే వ్యక్తుల్లో మానసిక ధైర్యాన్ని నింపి, జీవించేలా చూడాలన్నారు. తనకు ఎవరూ లేరనే అగాధాన్ని పూడ్చడానికి భరోసా నింపాలన్నారు. ప్రమాదకర సమయంలో అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీనివాస్, రామరాజు, బాలూనాయక్, ఐలేశ్, భరత్ పాల్గొన్నారు.

## ధరల పట్టిక ప్రదర్శించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : పట్టణంలోని ఉన్న అన్ని ప్రైవేట్ దవాఖానల్లో యాజమాన్యాలు తప్పనిసరిగా ధరల పట్టికను ప్రదర్శించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీల అన్నారు. గురువారం పట్టణంలోని నిక్కామెహల్త్ కేర్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రైవేట్ దవాఖానల్లో అందిస్తున్న సేవలు, టెస్టుల వివరాలు రోగులకు తెలిసేలా ఉండాలన్నారు. అనంతరం నిక్కామెహల్త్ కేర్ సెంటర్‌లో ఇన్‌పేషెంట్ వివరాలు, ఇతర రికార్డ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేటర్స్ కేవీ రాజు, గీత పాల్గొన్నారు.

## జాతర పనుల పరిశీలన

కురవి, ఫిబ్రవరి 20 : కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ జాతర ఈ నెల 25వ తేదీ అంకురార్పణతో మొదలుకానున్నది. ఈ సందర్భంగా జాతర పనులను ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ, పాలకమండలి సభ్యులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది నూతనంగా ప్రచారరథాన్ని ఏర్పాటు చేయగా, గురువారం ఆలయ చైర్మన్ ప్రారంభించారు. అనంతరం పాలకమండలి సభ్యులతో కలిసి నాగమయ్య దేవస్థాన ఆవరణలో జరిగే కల్యాణమండప ఆవరణలో పనులను పర్యవేక్షించారు. ప్రచార రథ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేశ్, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

## ఆధార్ ఆధారంగా కొనుగోలు చేయాలి

కేసముద్రం, ఫిబ్రవరి 20 : రైతులు యూరియా బస్తాలను ఆధార్ కార్డు ఆధారంగానే కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ధన్నసరి సహకార సంఘం ఆధ్వర్యంలో పెనుగొండ గ్రామంలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాన్ని గురువారం ఆయన పరిశీలించారు. యూరియా నిల్వలు, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఈ–పాస్ మిషన్ ద్వారానే రైతులకు యూరియా బస్తాలు అందించాలని సూచించారు. అనంతరం పంటలను పరిశీలించారు. వరిలో అగ్గి తెగుళ్లతో పాటు సుడి దోమ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. క్రాప్ బుకింగ్ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు వెంకన్న, రాజు, సాయి చరణ్ పాల్గొన్నారు.

## రక్తహీనతపై అవగాహన ఉండాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి20 : రక్తహీనతపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని కాకతీయ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మర్రి దయాకర్ అన్నారు. గురువారం పట్టణంలో రక్తహీనత అనే అంశంపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోడిన్ లోపం వల్ల వచ్చే రుగ్మతలు, వాటి నివారణ చర్యలను వివరించారు. ప్రధానంగా ఎదిగే పిల్లల విషయంలో రక్త హీనత రాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు ప్రభాకర్, కవిత, క్రాంతి, సునీత, మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : జిల్లాలో ఆరోగ్య శాఖ నియమనిబంధనలు పాటించని ప్రైవేట్ దవాఖానలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టోప్నోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అనేక ప్రైవేట్ దవాఖానల్లో కనీస అర్హత లేనివాళ్లు ల్యాబ్, మెడికల్ షాపులను నడుపుతున్నారని, పరీక్షలు, సర్జరీల పేరుతో పేదల నుంచి అధిక మొత్తంలో ఫీజులను వసూలు చేస్తున్నారని అన్నారు. జిల్లా వైద్యశాఖ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వాసూనాయక్, సురేశ్, వెంకన్న పాల్గొన్నారు.

## నేడు 'డయల్ యువర్ డీఎం'

తొర్రూరు, ఫిబ్రవరి 20 : తొర్రూరు పరిసర ప్రాంత ప్రజలు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొర్రూరు డిపో పరిధిలోని వివిధ రూట్లలో బస్సు సర్వీసులు, బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలపై ప్రజలు తమ అభిప్రాయాలను ఫోన్ ద్వారా తెలియజేసి డిపో అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రయాణికులు, స్థానిక ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విలువైన సూచనలు అందించాలని విజ్ఞప్తి చేశారు. 9959226053 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## 8 మందిపై కేసు నమోదు

నెల్లికుదురు, ఫిబ్రవరి 20 : నిబంధనలకు విరుద్ధంగా కరెంట్ షాక్ పెట్టి ఒకరి మృతికి కారకులైన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. పడమటిగడ్డ తండాకు చెందిన జాటోత్ రెడ్యా(27) అదే తండాకు చెందిన ధరంసోత్ రెడ్యా, బీకు, గుగులోత్ రాజు, సోముల, మోహన్, బాదావత్ తిరుమలేశ్, జాటోత్ నర్సింహ, నాను కలిసి బుధవారం మేచరాజుపల్లి గ్రామ శివారు ఆకేరువాగులో కరెంట్ షాక్ పెట్టి చేపలు పడుతున్నారు. 8మంది అజాగ్రత్త కారణంగా జాటోత్ రెడ్యా వాగులో ఉండగానే కరెంట్ సరఫరా జరిగి షార్ట్ సర్క్యూట్‌తో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన వారు తొర్రూరు దవాఖానకు తీసుకెళ్లగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు 8మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఒకరికి ఏడాది జైలు శిక్ష

### రూ. 2వేలు జరిమానా

డోర్నకల్, ఫిబ్రవరి 20 : అంగన్‌వాడీ టీచర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి మహబూబాబాద్ కోర్టు గురువారం ఏడాది జైలు శిక్షతోపాటు రూ.2వేలు జరిమానా విధించారు. కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. వెన్నారం గ్రామానికి చెందిన అనపర్తి వెంకన్న 2019 ఫిబ్రవరి 11న డబ్బులు విషయంలో అదే గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించారు. కింద పడేసి కొట్టి, చెవి కొరికాడు. దీంతో మహిళ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఏఎస్సై సూరయ్య ఘటనా స్థలానికి చేరుకొని సాక్షులను విచారించగా, అప్పటి సీఐ శ్యామ్‌సుందర్ కోర్టులో చార్జి షీట్ వేశారు. కేసుకు సంబంధించి 8 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలలిత వాదనను వినిపించారు. వాదోపవాదాలు విన్న తర్వాత మేజిస్ట్రేట్ నిందితుడికి సంవత్సరం జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దంతాలపల్లి, ఫిబ్రవరి 20: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సింహులపేట మండలం జయపురం గ్రామానికి చెందిన శ్రీను, రామన్నగూడెం గ్రామానికి చెందిన నాగన్న తొర్రూరులోని పారాచూట్ డిస్టిబ్యూటర్ (పంపిణీదారుడు) దగ్గర పనిచేస్తున్నారు. నర్సింహులపేటలోని కిరాణా షాపులో వేసేందుకు ఓమినీ వ్యాన్‌లో సరుకులు తీసుకెళ్తుండగా బీరిశెట్టిగూడెం వద్ద వ్యాన్‌టైర్ పగిలి పల్టీ కొట్టడంతో శ్రీను, నాగన్నకు గ